Nava Telangana 08-09/11/17

# మెట్రో రైలెక్కిన గవర్నర్ నరసింహన్

**ఎస్ఆర్‌నగర్ నుంచి మియాపూర్‌కు ప్రయాణం**

నవతెలంగాణ - సిటీబ్యూరో

రాష్ట్ర గవర్నర్ నరసింహన్ హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణించారు. బుధవారం ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్‌కు వచ్చిన ఆయన మంత్రి కేటీఆర్‌తో కలిసి మియాపూర్‌కు మెట్రో రైలులో ప్రయాణం చేశారు. మియాపూర్ మెట్రో రైలు డిపోను సందర్శించి ప్రాజెక్టు పనులపై ఆరాతీశారు. ఈ నెల ఆఖరికి మెట్రో రైలు ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో మెట్రో ప్రాజెక్టు పనులను పరిశీలించారు. మియాపూర్ మెట్రోస్టేషన్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న సుందరీకరణ పనులు, స్టేషన్‌లో తుది దశలో ఉన్న పనుల తీరును మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెట్రో రైలుకు వినియోగిస్తున్న ఆధునిక సిగ్నలింగ్, విద్యుత్ లైన్ల గురించి, మెట్రోస్టేషన్లలో పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు కల్పిస్తున్న ఆధునిక సేవలు, స్టేషన్ పరిసరాల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి మెట్రో ఎండీ వివరించారు. ఆ తర్వాత మియాపూర్ నుంచి తిరిగి మెట్రో రైలులోనే ప్రయాణించినవారు ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్‌లో దిగారు. గవర్నర్ వెంట మంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, మున్సిపల్‌శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్, ఎల్అండ్‌టీ ఎండీ శివానంద నింబర్గి తదితరులున్నారు.



మెట్రోలో ప్రయాణిస్తున్న గవర్నర్, అధికారులు